నీవు ఏకాయకీని మా ఇంటికిపో. అక్కడ నా భర్త కుర్చీలో కూర్చుని ఉంటాడు. చదువుకుంటూ ఉంటాడు. లేనిచో నా ఫోటో చూస్తూ ఉంటాడు." అని మొదలుపెట్టి ఏమేమో వ్రాసింది. కొంతకాలానికి విచారం తగ్గింది.

కల మెలుకువచ్చింది. వెంటనే స్నానం చేసి కాఫీహోటలుకు వెళ్లాను. అక్కడ ఒక స్నేహితుడు కనిపించి ఏమిరోయి! నిన్న నాతో చచ్చిపోతారా, మళ్లీ కనపడనన్నావు? అన్నాడు. అవునురా, నిన్న అల్లాగే అనుకొన్నా. కాని దర్మిలా ప్రోగ్రాము మార్చేశా! అన్నాను నేను.

# కొత్త ఎత్తు

చంద్రశేఖరం - ఓరే - చంద్రం.

ఏమిటోయి ఏమిటి యిల్లా వచ్చావు?

నీకేమయినా బాకీగా నేను?

ఎబ్బే, ఏమి బాకీ లేదే! ఎందుకు అల్లా అడిగావు? పాత బాకీలన్నీ తీర్చేస్తున్నావా ఏమిట్రా

ఎబ్బే! లేదురా. నేను ఎవరెవరి దగ్గర ఏమి పుచ్చుకొన్నానో? ఏమి జ్ఞాపకం లేదు: నేను యిదివరలో పుచ్చుకొనని వాళ్లెవరైనా ఉంటే వాళ్ళదగ్గర ఏమైన పుచ్చుకొందామని వచ్చా. నీ దగ్గర రెండు రూపాయలు ఉంటే యిస్తూ అన్నాడు

చంద్రశేఖరానికి నవ్వువచ్చింది. అతను హేమసుందరానికి అప్పుయిచ్చాడో లేదో తెలియదు. కాని అతని ద్వారా హేమసుందరం జీవితకథ తెలిసింది.

అసలు సుందరం మంచి కుటుంబంలో పుట్టినవాడేట. పాఠశాలాంతర పరీక్షకు వెళ్ళకముందే తలిదండ్రులు కాలంచేశారు. యావదాస్తికి ఇతడొక్కడే వారసుడైనాడు. తన చిత్తం వచ్చినరీతిని ఆస్తిని వ్యయపరచటం మొదలెట్టాడు. కొద్దిరోజులలోనే పిత్రార్జితమైనఆస్తి యావత్తువిక్రయించాడు. ఆసొమ్ము ఎల్లా ఖర్చు అయిందో ఎవరికి తెలియదు.

కాని అచిరకాలంలో ఆసొమ్ము యీతని చేతులలోనుంచి

జారి పోయింది.

తల్లిదండ్రులు చనిపోయిన దగ్గరనుంచి హేమసుందరం ఒహారికిందనౌకరికి ప్రయత్నించక స్వచ్ఛందవృత్తి అవలబించాడు. ఎప్పుడూ తెల్లని బట్టలు వేసుకొంటాడు. ముప్పై నలభై రూపాయల తక్కువకిమ్మత్తుచేసే కోటు అతను వేసుకొనగా మనము చూడము.

త్రికాలములయందు తేనీరును త్రాగడం హేమసుందరానికి అలవాటయింది. జట్కా బండి వాళ్ళు ఆతనిని బలవంత పెట్టి ఎక్కించుకొంటారు. డబ్బు ఖర్చుచేయడంలో అతను కొన్ని క్రొత్తమార్గాలు కనిపెట్టాడని నేను చెప్పగలను.

అతను తార్కికుడు. దృఢమైన కాయముంటేనేకాని నిర్మలమైన మనస్సు, ఉండదనివాదిస్తాడు. నిర్మలమైనమనస్సు, పరిశుద్ధాత్మ ముక్తికిసాధనాలు. అయితే దృఢకాయాన్ని పెంచాలంటే ధాటీయైన భోజనం అత్యావసరం.

అయితే అతను తన ముక్తి కొఱకే పాటుపడుతున్నాడు. కాబట్టి స్వలాభిలాషి అంటారేమో. ప్రతివాడును ముక్తిని ఇల్లాసాధించాలన్న సంగతి అందరికి తెలియజేస్తున్నాడు కాబట్టి దేశభక్తుడుకూడాను.

అతను భోజన ప్రియుడా! ఆమాట ఎల్లా అనగలము? భోజనమును భోజనము కొఱకే ప్రేమించడు. అది ముక్తిసాధన క్రియగా ప్రేమిస్తాడు. అందుకనే ఆ బ్రాహ్మణుడు పిస్తరివద్దకువచ్చి "ఇంకా కొంచెంబంగాళాదుంపలకూర వడ్డించనాండి"



అంటే 'వడ్డించుకో' అంటాడు. 'వడ్డించుకో' అంటంలో అతనికి భోజనమునందుండే విరక్తిభావం తేటపడుతున్నది.

'వడ్డించుకో! నాకొఱకు కాదు సుమా? నీకొఱకే! నీముక్తిసాధనకొఱకు నీఅంతరాత్మకొరకు ఇల్లా వడ్డించుకో', అనే భావం ఆమాటలలో ధ్వనిస్తున్నది. నీకు వేస్తే నాకు ఎల్లా వస్తుందయ్యా అంటే సమాధానమిది. నేను తిని పరిశుద్ధాత్మతో ముక్తి పొందుతాను. నా మోక్షప్రాప్తికి నీవు కారణభూతుడవు అయినావు కాబట్టి నీకు పుణ్యంవస్తుంది-కాబట్టి యింకా కొంచెం వడ్డించుకో.

తిండిలోనేగాక ప్రతి విషయంలోను హేమసుందరానిది వేదాంతమార్గమే. కాఫీ హోటలుకు ఇద్దరు స్నేహితులతో కలసివెళ్ళాడు. అంతాకలసి తిన్నారు. డబ్బు సుందరం చెల్లించనన్నాడు. వారిద్దరిల్లో ఒకరు చెల్లించక తప్పిందికాదు. ఏమిరా సుందరం డబ్బు లేకుండా కాఫీ హోటలుకు ఎల్లా వచ్చావురా అంటే ఓరివెర్రివాడా ethicalగా ఆలోచిస్తే తినేదెవరు? తినిపించేవాడెవడు? అంతా ఒకటి కాదా.

"తిననేర్చు వాగనేస్తట
తినిపించువాడు రామభద్రుండట"

నేను నీవు అనే రెండువ్యక్తులు ఏడిచినవా?, నేనెవరు? వాడెవడు? నాలో వెలుగుతున్న ఆ అకళంకమైనట్టువంటి దేదీప్యమానమైన జ్యోతి అతనిలో వెలగడంలేదా! సూర్యుడు అన్ని ఘటాలలోను వెలుగుతూ ఇన్ని సూర్యులుగా మననేత్రద్వ

యానికి కనిపించినట్లు ప్రతిమానవుడు ఇదినాది అనేటటువంటి అజ్ఞానాంధకారంలో పడిపోయి ద్వైతంలోకి దిగుతున్నాడోయి అని లెక్చరుకొట్టాడు.

అందుకని అతను అప్పుపుచ్చుకొని తిరిగి యివ్వవలసిన బాధ్యత లేదని కొన్ని అప్పులు యివ్వలేదు. అంతగా అడిగితే ఇస్తానులే అంటాడు. ఎక్కడినుంచి తెచ్చియిస్తాడు? మరొకరిని అడిగి యితనికి తీరుస్తాడు. ఆ ఇంకోఅతను అడిగినా అంతే! అంటే అర్థశాస్త్రసూత్రం వొకటి యిక్కడ ప్రయోగిస్తే ఉన్న చిక్కు దెలిసిపోతుంది. డబ్బు అనేది దేశందాటి వెళ్ళితే దేశానికి నష్టం. దేశంలో డబ్బు దేశంలోఉంటే దేశం బాగుపడుతుంది. ఇతరదేశాలనుంచివస్తే మరీమంచిది. అప్పు తీసికొని యివ్వకపోవడంలో వచ్చే నష్టంఏమిటి? ఏమిలేదు. దేశంలో సొమ్ము దేశంలో ఉంది. చేతులు మారినాయి. కాని దేశం మారలేదు. ఎవరిదగ్గిర ఉంటేనేమి: అంతాఒకటే. కాబట్టి బాగా ఆలోచిస్తే ఆవిషయం అంత విచారణీయంగాదు.

అయితే అప్పులు ఎవరిస్తారుఅనేది పెద్దచిక్కుకాదు? ఎందుకివ్వరు? ఇవ్వకపోతే తనకున్న ఆస్తి తాకట్టు పెడతాడు. ఇల్లు, పొలము, చరాస్థి స్థిరాస్థులు అన్నీ తాకట్టులో ఉన్నయి. ఇంక ఏమి తాకట్టుపెడతాడు? అంటారేమో ఒకరికి తెలియకుండా మరొకరికి ఆవస్తువునే ఆఇల్లునే ఆపొలాన్నే తాకట్టు పెట్టాడు వీలయినంతవరకు. ఇంక తాకట్లకు వీలు లేదు. అయితే మానె నమ్మకంమీగ కొన్ని, ఇంకొకరు



జామీనుఉండి యిప్పించినవి కొన్ని, తాకట్టు అప్పులు తనఖా అప్పులు చేబదుళ్లు, స్నేహితుల అప్పులు రేపు యిచ్చే అప్పులు సాయంత్రం అప్పులు, యిల్లా అన్ని అప్పులు, అప్పులు అయిపోయినవి. లోకంఅంతా అప్పులవాళ్లే. ఇంకొకరు అయితే అప్పులు తీర్చలేకపోయేవాళ్లే. అదిగాక దిగులుపడి క్షీణించిపొయ్యేవాళ్లే? ఇతనికి దిగులేలేదు. మహాజ్ఞానికి ఆభేదం లేదు.

అయితే హేమసుందరానికి భుక్తి జరిగింది కాదు. అప్పులు యింక ఎవ్వరు యివ్వలేదు. స్నేహితులుకూడా యితనిని జూచి అసహ్యించుకొన్నారు. కొందరు తిట్టారు. కొందరు ముఖ్యాపలాడారు. అనరాని మాటలుకూడా అన్నారు.

ఇంకొకడు "తలెత్తుకొని తిరగటానికి వీలులేని స్థితికి వచ్చింది" అన్నాడు. సుందరం ఏమన్నాడు? పోరా, యిప్పన్ని లెక్కాజమా? మహాజ్ఞానులకు యివిలెక్కా! లోకంలో అనేకమంది అనేక విధాలుగా అంటారు. వారి మాటలు లెక్కేమిటి? "పలుకుచుందురు పలువురు పలువిధాల, వారిమాటలు గాలికి పారిపోవు" అని మహాకవి అన్నాడు

ఈ తనువు శాశ్వతమా...............
చిత్తాస్వాతులు రెండు సంధింపవుముత్తెపు
చిప్పలోపడ్డాది చినుకొక్కటి
ముత్యమై నీళ్లలో మునిగిపోయేనాడు
చిప్పతో ఏమైన చెప్పిపోయిందా.

ఎప్పుడు రాలిపోతుందో! ఈ ఉన్న మూడు రోజుల్లో "ఇది నాది' ఏమిటో! "నేను అనే అహంభావం పెంచుకొని తగవులు తెచ్చుకొంటారు." "తాను తానని తిన్నకలాద్దది యీ దేహం" అని సమాధానం చెప్పుకొనేవాడు.

౨

కాని ప్రపంచకంలో తిండిలేనిది వెళ్ళదు. ఇంతతిండి యీజీవికి వేస్తే యీజగమనే నాటకరంగంలో కొంతసేపు నటనచేస్తుంది ఇతనికి తిండిగొరికింది కాదు. మరి మోక్షసాధనకా తిండి మనవాడికి. అదిగాక అప్పులవాళ్ళ బాధ ఎక్కువయింది. ఆవిషయం పరలోకప్రాప్తి కేమి ఆటంకం కలిగించకపోయినా ఈలోకంలో మట్టుకు కంటకంగా ఉంది.

అందుచేత అతను అన్నం మాని యేదో ఫలహారం చెయ్యటం ప్రారంభించాడు. అదిగాక భగవద్గీత కూడా ఒకటికొని పారాయణ ఆరంభించాడు కానిగీతాపారాయణ ఋణబాధా నివారణకై ప్రయోజనపడలేదు. ఈబాధతీర్చుకోవాలని నిశ్చయించుకొని ఈక్రింది విధంగా "దేశసేవలో" ప్రకటించాడు.

"పి. సుందరరావుగారు లోకుల బాకీలన్నీ తీర్చడానికి నిశ్చయించుకొన్నారు. సెప్టెంబరు 15 వ తారీకున అందరికి బాకీలు తీరుస్తారు కాబట్టి ఆరోజుకు లెక్క తయారుచేసుకొని వారింటికి రావలసినదని బాకీదార్లను ప్రార్థిస్తున్నారు."

ఇదిజూచి వర్తకులు మరి ఇతరధనికులు చాలా సంతోషించారు. తాము అనుకొన్నంత చెడ్డవాడు కాడు అని తోచింది. పాపం యిన్ని రోజులనుంచి ఏదో యిబ్బందులవల్ల తీర్చలేదు. రేపు తీర్చేస్తాడు అన్నారు. లెక్కలుజూచుకొన్నారు. సిద్ధంగా రూపాయలణాలతో పద్దులు తయారయినవి. పదిహేనో సెప్టెంబరు కోసం యెదురుచూస్తున్నారు.

సుందరానికి రోజురోజుకు భక్తి ఎక్కువయింది. ఆసంగతి అందరికి తెలిసింది అంతా "పూర్వం మోస్తరుగాదు. సుందరం ఇప్పుడు చాలా దైవభీతిగలవాడైనాడు. గీతాపారాయణంగూడా చేస్తున్నాడు. ఇక మనకు బాకీతీర్చడమే గాకుండ ముందు పవిత్రమైన జీవనంలోకి దిగుతాడు" అన్నారు.

పద్నాలుగో సెప్టెంబరు వచ్చింది. రేపు బాకీలు సుందరం తీరుస్తాడు. సాయంత్రం యెప్పటిమోస్తరుగానే వచ్చింది. రాత్రిగడచి తెల్లవారింది. కాని ఆరోజున సుందరంగారు ఆకస్మికంగా 'పరలోకగతులైనారని' పుకారు పుట్టింది. వర్తకులు, బాకీదార్లు పద్దులతో వచ్చారు. కాని సుందరం శవం యింటిముందు, వాళ్ళకు కనిపించింది. ఎంత చెడ్డవాడైనా చనిపోయినతరువాత "అయ్యోపాపం" అనక మానరు. బదికుంటెవాడైనా బాకీలు ఎల్లా తీర్చునాడో కొంతపుంది "ఈవిధవ బాకీ తీర్చకుండా చచ్చిపోయినా" డని తిట్టారు కొందరు అనరానిమాటలు అన్నారు. ఏమంటేనేమి

ఆయన స్వర్గానికి దారిపట్టాడు. ఈ మాటలాయనకు వినపడవు.

మహారణ్యంలోకూడా ఫలవృక్షాలుంటవి. ఎడారిలోకూడా జలాశయములుంటవి. దుర్మార్గులలోకూడా మంచివాళ్ళుంటారు కొందరు. "ఏదో అయిపోయింది. ఆయనకు ఆస్తిఏమి లేదు. మనంచేసేది ఏమిలేదు. అప్పులు ఉన్నవిఅని మనంఅనుకుంటిమా అంటే, ఆయనమళ్ళి మనయిళ్ళల్లో ఆయువుశేని బిడ్డగానో కుక్కగానో జన్మమెత్తి తీర్చుకోవాలి. అల్లాశాస్త్రాలు ఘోషిస్తున్నయి. ఎందుకొచ్చిన పీకులాట! పాపం ఆయనను బంధవిముక్తుణ్ణిగా జేద్దాము. అప్పుడు ఆయన సరాటంకంగా మోక్షానికి తోవబడతాడు. లేకపోతే యమభటులు అతనితో "ఏమోయి నీకు అప్పులున్నయి మళ్ళీజన్మనెత్తాలి నరకానికినడు" అంటారు కాబట్టి మనం అంతాకలిసి ఆయనను ఋణబంధవిముక్తుణ్ణిచేసి పుణ్యం గట్టుకుందాము. బ్రాహ్మడికి యింతభోజనం పెడితేనేపుణ్యం. మోక్షం యిప్పిస్తే యిక చెప్పనక్కరలేదు" అన్నారు. అంతానిజమేఅన్నారు. చేసేది లేక పోవటంచేత బాకీదార్లు పుట్టినే పుణ్యం వస్తుంటే పోగొట్టుకోటం ఎందుకని సరేఅన్నారు. అంటే ఎల్లాగు చేసేది? ఏమిలేదు, అల్లాబంధవిముక్తుడ్ని జేస్తే ఆయనకు మోక్షప్రాప్తిఅవుతుంది. వీళ్ళకు పుణ్యంవస్తున్నది. సరే అంటే సరే అన్నారు.

బ్రాహ్మణులు శవాన్ని పాడిపైనవిరిచి కడుతున్నారు.



కొత్తకుండ తెచ్చారు. మూకట్లోనిప్పుతయారయింది. దర్భలు మొదలైన పరికరాలతో బ్రాహ్మలు తయారయినారు.

వర్తకులు తమపద్దు పుస్తకముల్ను తీసి ఆయన పేజీలో ఆయనపేరుఉన్న పద్దులంతా కొట్టివేశారు పాపం. బ్రాహ్మణునికి మోక్షానికి దారి తెరిచి అయింది.

బ్రాహ్మణుల మంత్రం ప్రారంభించారు. నలుగురు బ్రాహ్మలు నాలుగు కొమ్ములు పట్టుకొని శవాన్ని పైకెత్తారు. ఇంట్లోవాళ్లంతా ఒకపెట్టునఏడ్చారు. గుమ్మందాటేబజారులోకివెళ్లారు. ఇంట్లోవాళ్ళు లోపలికి పోయినారు ఏడుస్తూ.

శవాన్ని తీసుకొని నడుస్తున్నారు. ముందు కర్మజేసే ఆయననిప్పట్టుకొని, వెనకాల, వర్తకులు యితరులు నడుస్తున్నారు. చూచిన వాళ్ళంతా పాపం పోయినాడన్నారు. నాలుగుబజార్లు కలిసేచౌకు దగ్గరకువచ్చిన తరువాత ఎవరిదారినవాళ్లు యింటికి వెడదామనుకొంటున్నారు. ఇంతలో "దింపండి" "దింపండి" అని కేకలు వినపడ్డయి. శవాన్ని దింపారు. మెల్లగా కట్లు విప్పారు. ఆయన మెల్లగాలేచి కూర్చున్నాడు. "బ్రతికాడు" బ్రతికాడని, అంతా కేకలేశారు.

అతనుకూడా "బ్రతికానురా బాబూ" అప్పులన్నీ తీరినయా ఇంకాఉన్నయ్యా అన్నాడు. "అప్పులన్నీ తీరినయి యెవరికి బాకిలేవు." అని ఎవరో కుర్రవాడు కేకేశాడు.

బతికానురా నాయినా అని అతనుకూడా లేచాడు. దారిలో ఎవరో కనబడి ఏమిరో ఎవరో చచ్చావన్నారే నీవు అన్నారు. ఎబ్బేలేదురా. ఏదో అప్పులబాధపడలేక అదో ఎత్తు ఎత్తానన్నాడు.